

పశ్చిమలో...

8లో

## రికార్డు స్థాయిలో క్రియా సభ్యత్వాలు

17వ వసంతంలోకి...
నేటి దినపత్రిక
సూర్య
ఎన్టీఆర్ - కృష్ణా
సోమవారం 29 జులై 2024 పేజీలు 8

# రూ.220కోట్లతో..
## ఇంటింటికి తాగునీరు

**రూ.160కోట్లతో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం - ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరించిన మంత్రి**



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** జిల్లాలో వివిధ అభివృద్ధి పనులను చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులను వెచ్చిస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఆదివారం ఉదయం స్థానిక బృందావన థియేటర్ పక్కన గల నియోజకవర్గ టీడీపి కార్యాలయంలో ఆయన ప్రజాసమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ప్రతి ఒక్కరి సమస్యను ఓపిగ్గా ఆలకించిన ఆయన వారి సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం కోరుతూ వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చారని, మిగతా 2లో



# అందరూ... సుభిక్షంగా వుండాలి

**మేళ తాళాలతో అంగరంగ వైభవంగా అమ్మవారికి ఆషాడం సారే సమర్పించిన సీపీ ఎస్.వి.రాజశేఖర బాబు**

**ఇంద్రకీలాద్రి, మేజర్ న్యూస్ :** ప్రతి సంవత్సరం ఆషాడమాసంలో ప్రజలు, పోలీసు కుటుంబాలు ఆనందంగా, సుభిక్షంగా వుండాలని ఎన్.టి.ఆర్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి చీర, సారెను సమర్పించారు. ఈ నేపథ్యంలో పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు దంపతులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో అనవాయితీ ప్రకారం రావి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి విజయవాడ పశ్చిమ డివిజన్ పరిధిలోని వన్ టౌన్ పోలీసు స్టేషన్ నుండి మేళ తాళాలతో అంగరంగ వైభవంగా బయలుదేరి శ్రీ కనక దుర్గమ్మ అమ్మవారి దేవస్థానంనకు చేరుకొని అమ్మవారికి ఆషాడం సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈ.ఓ.కె.ఎస్. రామారావు, దేవస్థాన అధికారులు ఆషాడం సారే తీసుకు వస్తున్న నగర పోలీస్ కమిషనర్ కి సాదరంగా ఆహ్వానం పలికి వేద పండితుల నడుమ సారే సమర్పణ అనంతరం వేదమంత్రాలతో ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ ప్రతి మిగతా 2లో...



# సముద్ర తీరాన యోగా సాధన వినూత్నం

- రాష్ట్రానికే తలమానికంగా మంగినపూడి బీచ్‌ను తీర్చిదిద్దుతాం
- అన్ని విధాల అభివృద్ధిపరచి ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నదే నా కల
- రాష్ట్ర గనులు, భూగర్భవనరులు ఆబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** మంగినపూడి బీచ్‌ను రాష్ట్రానికే తలమానికంగా ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు ఆబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఆదివారం ఉదయం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ నేతృత్వంలో ప్రభుత్వ ఉద్యోగులకు యోగా సాధన కార్యక్రమం తొలిసారిగా మంగినపూడి సముద్ర తీరాన ఏర్పాటు చేశారు. గత ఐదు రోజులుగా చేస్తున్న యోగా సాధనకు భిన్నంగా ఆదివారం సముద్ర 2

# పూర్తిస్థాయిలో బాలల అక్రమ రవాణాను అరికడదాం

**రాష్ట్ర ఏంఏస్‌ఏంఈ, సేర్ప్ ఎన్నారై మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



**విజయవాడ, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో బాలలు, మానవ అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు అధికారులు, అనధికారులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు, బాలలతో పనిచేసే సంఘాలు తమ వంతు భాద్యతగా అవగాహన కల్పించి సమిష్టిగా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏంఏస్‌ఏంఈ, సేర్ప్ ఎన్నారై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జూలై 30న జరుపుకోబోతున్న ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నేపథ్యంలో ఆదివారం హెల్ప్, విముక్తి సంస్థ, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, సీఐడీ మానవ అక్రమ రవాణా నిరోధక యూనిట్ సంయుక్తంగా రూపొందించిన మానవ అక్రమ రవాణా నిరోధానికి సంబంధించిన గోడ పత్రికను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావుతో మిగతా 2లో...

(మొదటిపేజీ తరువాయి)



## అందరూ సుభిక్షంగా వుండాలి

సంవత్సరం ఆషాడమాసంలో ఎన్.టి.ఆర్ జిల్లా పోలీసుల ఆద్వర్యంలో శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి ఆషాడం సారెను సమర్పించడం అనవాయితీగా జరుగుతుంది. పోలీస్ కుటుంబాలు, ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని, ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు నిండుగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమీషనర్ తో పాటు డి.సి.పి.లు గౌతమి షాలి, ఉదయరాణి, హరికృష్ణ, చక్రవర్తి, అడిషినల్ డి.సి.పి.లు కృష్ణ మూర్తి నాయుడు, ఏ.సి.పి.లు, ఇనస్పెక్టర్లు, ఎస్.ఐ.లు సిబ్బంది, పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### పూర్తిస్థాయిలో బాలల అక్రమ రవాణాను అరికడదాం



కలిసి జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నిరోధంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సంబంధిత అన్నిశాఖల విభాగాలు సిబ్బంది ప్రజా ప్రతి నిధులు, స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు భాగస్వామ్యం కావాలని కోరారు. ముఖ్యంగా డ్రగ్స్, సైబర్ నేరాలను కూడా నియంత్రణ చేయడానికి నిరంతరం కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. కొంతమంది మధ్యవర్తులు, మోసగాళ్లు ఉద్యోగాలు, సినిమా, టీ వీ లలో నటించే అవకాశాలు కల్పిస్తామని ప్రలోభాలకు గురి చేసి బాలలను,యువతను మోసం చేయడంతోపాటు అవయవ మార్పిడికి కూడా పాల్పడుతున్నారన్నారు. మానవ అక్రమ రవాణా ను రాష్ట్రంలో అరికట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని, సంబంధిత విభాగాలు, సిబ్బంది దృడ సంకల్పంతో పని చేసి రాష్ట్రాములో బాలల అక్రమ రవాణా జరగకుండా పూర్తి స్థాయిలో చర్యలు చేపడతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో, జిల్లా బాలల సంక్షేమ సమితి అధ్యక్షులు జీ హిమబిందు,మిషన్ వాత్సల్య సిబ్బంది రామకోటి, చైల్డ్ లైన్ సిబ్బంది మీనా,గౌరీ,అనిల్ తో పాటు ఎన్ జీ ఓ ప్రతినిధులు మమ్ముల తిరుపతి రావు, ఏంజీల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### శాకంబరి అవతారంలో అమ్మవారి దర్శనం..



**జగ్గయ్యపేట, మేజర్‌న్యూస్ :** జగ్గయ్యపేట మండలం షేర్ మహమ్మద్ పేట గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారు శాకంబరీ అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.. అమ్మవారిని దర్శించేందుకు గ్రామస్తులు పోటెత్తారు. సమరసత సేవా ఫౌండేషన్ సహకారంతో నిర్మించిన దేవాలయంలో అమ్మవారికి నిత్య పూజలు అందుతున్నాయని ఆలయ సభ్యులు తెలియజేశారు.

### పిచ్చయ్య కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ



**చందర్లపాడు, మేజర్ న్యూస్ :** చందర్లపాడు మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో ఇటీవల మరణించిన పాపురు పిచ్చయ్య కుటుంబ సభ్యులను స్థానిక ఎన్డీఏ నేతలతో కలిసి శాసన సభ్యులు తంగిరాల సౌమ్య పరామర్శించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ఆమె ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# రూ.220కోట్లతో ఇంటింటికి తాగునీరు

(మొదటిపేజీ తరువాయి)



వారందరి సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. దాదాపుగా 250 అర్జీలను స్వీకరించామని, వాటిల్లో తక్షణమే పరిష్కారం కాగల సమస్యలకు వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పరిష్కరించామన్నారు. పరిస్థి తులను బట్టి వారంలో శనివారం లేదా ఆదివారము రోజులలో ఒకరోజు ఈ ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి అర్జీలను స్వీకరిస్తున్నామని, పరిష్కరిం చిన సమస్యలను సంబంధిత అర్జీదారులకు ఎప్పటికప్పుడు ఫోన్ ద్వారా తెలియజేస్తున్నామన్నారు. జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొన్ని చోట్ల నారుమళ్ళు మునిగిపోయి రైతులకు తీవ్ర నష్టం కలిగించాయని, అ లాంటివారికి మరల నారుమళ్ళు పోసుకునేందుకు ఉచితంగా విత్తనాల పం పిణీకి చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులకు సూచించడం జరిగిం దన్నారు. అదేవిధంగా కాలువల్లో పెద్ద ఎత్తున పేరుకుపోయిన తూటుకాడ, గుర్రపుడెక్క తొలగింపునకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకం జలజీవన్ మిషన్ ద్వారా రూ.220 కోట్ల వ్యయంతో ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అందుకు అవసరమైతే మరిన్ని నిధులను తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో ఉపాధి హామీ పథకం కింద జిల్లాకు మంజూరైన దాదాపు రూ.160 కోట్ల నిధులతో గ్రామాల్లోని రహదారులు, డ్రైనేజీలు, స్మశానవాటికలకు కాంపౌండ్ వాల్స్ పూర్తిస్థాయిలో నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. మచిలీపట్నం నగరంలోని మురుగు కాలవల్లో పూడుకుపోయిన సిల్ట్ తొలగించడంతో పాటు డ్రైనేజీలను మరమ్మతులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.60 కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. రాబోయే రోజుల్లో నగరంలో మురుగునీరు అనేది నిలవకుండా ఉండేలా డ్రైనేజీ వ్యవస్థపై మాస్టర్ ప్లాన్ ను రూపొందించేందుకు ఇటీవల నగరంలో ఢిల్లీ ప్రతినిధుల బృందం పర్యటించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, స్థానిక నాయకులు బండి రామకృష్ణ, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గోపు సత్యం, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# సముద్ర తీరాన యోగా సాధన వినూత్నం

(మొదటిపేజీ తరువాయి)



తీరాన ప్రకృతి ఒడిలో చల్లని ఆహ్లాదకర వాతావరణంలో సముద్రపు అలల సవ్వడి మధ్యన, పక్షుల కిలకిల రావాల నడుమ ఎంతో వినూత్నంగా సాగింది. రాష్ట్ర మంత్రి, జిల్లా కలెక్టర్, జిల్లా సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ పాల్గొని యోగాసనాలు వేసి అందరికి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. యోగా గురువులు ముదిగొండ శాస్త్రి, మద్దాల చింతయ్య, శీలం రమేష్, రేఖలు ఛాలన క్రియలు, వజ్రాసనం, నాడీ శోధన, భ్రమరి, ప్రాణాయామం వంటి యోగా ప్రక్రి యలు సాధన చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మంగినపూడి బీచ్ ను బృందావ గార్డెన్ లాగా అన్ని విధాల అభివృద్ధిపరచి ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నదే తన కల అన్నారు. గతంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో మంగినపూడి బీచ్ అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టామ న్నారు. సము ద్ర ఒడ్డున ఎత్తు పెంచి గోడ కట్టించామని, గతంలో నడిచి వచ్చేందుకు చాలా ఇబ్బంది పడుతుంటే రహదారిని కూడా నిర్మించా మని, మొదటి దశలో 5 కోట్ల రూపాయలు మంజూరు చేసి రోడ్డు వేశామని మరలా 10కోట్ల రూపాయలు మంజూరు చేశామని ఇంతలో తమ ప్రభుత్వం మారి పోయి గత 5 సంవత్సరాలుగా ఇక్కడ అభివృద్ధి కుంటుపడిందన్నారు. హిందు వులు, ముస్లింలు సాంప్రదాయబద్ధంగా కార్తీక పౌర్ణమి వంటి పండుగ దినాల్లో సముద్ర స్నానాలు చేస్తారన్నారు. వారికి మంచినీరు, దుస్తులు మార్చు కునే గదులు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. హైదరాబాదు ప్రజలు వారాంతంలో ఎక్కడికి వెళ్లాలని ఆలోచిస్తున్నారని వారందరూ మంగినపూడి బీచ్ కి రావడానికి మంచి అవకాశాలు ఉన్నాయని, ఇక్కడ రిసార్టు, మరుగుదొడ్లు, మహిళలకు ప్రత్యేక స్నానపు గదులు, దుస్తులు మార్చుకొనుటకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆ దిశగా అడుగులు వేయడానికి కొంతమంది రాజకీయేతర పెద్దలతో బీచ్ అభివృద్ధి కమిటీని త్వరలో ఏర్పాటు చేసి అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. బీచ్‌లో రిసార్ట్‌లు ఏర్పాటు చేయడానికి చాలా మంది ముందుకు వస్తున్నారని, బహుళ జాతీయ కంపెనీలు కూడా నిధులు సమకూర్చేందుకు ముందుకు వస్తున్నాయన్నారు. మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి కూడా బీచ్ అభివృద్ధి కోసం చాలా కృషి చేస్తున్నారన్నారు.

గతంలో తమ ప్రభుత్వ హయాంలో ఇక్కడ బీచ్ ఫెస్టివల్ ఏర్పాటు చేశామని ఆ సమయంలో ఇసుక వేస్తే రాలనంత లక్షలాది జనం వచ్చారని, బోటు షికారు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అద్భుతంగా ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఆదివారం బీచ్కు మచిలీపట్నం నుండే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుండి 6 నుంచి 7 వేల మంది ప్రజలు వస్తున్నారన్నారు. ఇకపై ప్రతి ఆదివారం ఉదయం యోగా తరగతులు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కి సూచించారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ ఏ పనైనా చేతకాదని విరమించుకోవద్దని ప్రతిరోజు ప్రయత్నిస్తూ రోజురోజుకు క్రమక్రమంగా పనితీరు మెరుగుపరుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఐఏఎస్ అకాడమీ శిక్షణలో ఉన్నప్పుడు తాను జిమ్ములో ఎక్కువసేపు వ్యాయామాలు చేయలేకపోతున్నానని బాధపడ్డానన్నారు. తర్వాత రోజు రోజుకు వ్యాయామాల సమయం పెంచుకుంటూ మెరుగుపరుచుకు న్నానని తన వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు. చాలా కాలంగా మన శరీరం పెద్దగా చలానం లేకుండా ఉండిపోయామని నేడు కపాలభాతి, నాడీ శోధన వంటి యోగాసనాలు చేసే సమయంలో కొంత ఇబ్బంది ఉండొచ్చని దాన్ని అధిగమించుకుంటూ అంకితభావంతో చేస్తే మనమందరం ఆరోగ్యంగా ఉంటామన్నారు. యోగాసనాలు చేయగలమని విశ్వాసం మనలో ఉండాలన్నారు. సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ దర్గా కార్యక్రమానికి యోగా కార్యక్రమానికి మంచి స్పందన లభించడం శుభ పరిణామం అన్నారు. స్థానిక ప్రముఖులు బండి రామకృష్ణ మాట్లాడుతూ మొక్కలను విరివిగా నాటి కలుషితం అవుతున్న పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తదుపరి మంత్రి ప్రభుత్వ ఉద్యోగులకు యోగా సాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు అభినందిస్తూ జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్ సంయుక్త కలెక్టర్ డిఆర్ఓ యోగా గురువులు ముదిగొండ శాస్త్రి చింతయ్య టీటీడీ ధర్మ ప్రచార కార్యకర్త భాగవత కళాకారిణి మాధవి లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సతీమణి పృథ్వీ కళ్యాణి కూడా పాల్గొనడం చెప్పుకోదగ్గ విశేషం. తదనంతరం మంత్రి జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ తో కలిసి సముద్ర తీరం వెంబడి స్వచ్ఛీకరణ కార్యక్రమాన్ని చేపట్టి స్వయంగా చెత్తాచెదారాలను ఎత్తి చెత్తబుట్టలో వేసి ట్రాక్టర్ల ద్వారా తరలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, డిపిఓ నాగేశ్వర నాయక్, టూరిజం అధికారి రామ్ లక్ష్మణ్, సమాచార పౌర సంబంధాల శాఖ డిడి వెంకటేశ్వర ప్రసాద్, సర్వే భూ రికార్డుల ఏడి మనిషా త్రిపాఠి, కలెక్టరేట్ ఏవో నాంచారయ్య పలువురు యోగా సాధకులు, ప్రజలు పాల్గొన్నారు.



# అవగాహన లోపమా.. సమర్థత లేకనా ?

**అధికారులతో పని చేయించలేకపోతున్న అధికార పక్షం...**

**జడ్పీ సమావేశంలో బట్ట బయలు...**

**ఎమ్మెల్యేల తీరు మారాలి.. ప్రజలకు మేలు జరగాలి**

**మాజీ ఎమ్మెల్యే డీవై దాస్...**



**పామర్రు జులై 28 మేజర్ న్యూస్ :** అధికారులపై సాకులు చెబుతూ ప్రజా సమస్యలు పరిష్కరించలేకపోతున్న అధికారపక్ష ఎమ్మెల్యేల తీరు జిల్లా పరిషత్ సమావేశం సాక్షిగా బయటపడ్డాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పామర్రు మాజీ ఎమ్మెల్యే డి వై దాస్ ఎద్దేవా చేశారు.ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శనివారం మచిలీపట్నంలో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడిన తీరు ఇందుకు నిదర్శనంగా ఉందన్నారు.ఫలితంగా రైతులు, విద్యార్థులు తదితర ప్రజానీకం నష్టపోయే పరిస్థితిలు జిల్లాలో కాన వస్తున్నాయన్నారు.ఈ సమావేశంలో అవనిగడ్డ ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ సాగునీటి విషయంలో అధికారులు చొరవచూపడం లేదనే అంశాన్ని తెలియజేశారన్నారు.అలాగే పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా నిమ్మకూరు గురుకుల పాఠశాలలో లెక్కలు మాస్టార్ అంశాన్ని లేవనెత్తరన్నారు. వీరితోపాటు గుడివాడ ఎమ్మెల్యే వెనిగళ్ళ రాము పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తదితర ఎమ్మెల్యేలు ఇదే వైఖరిని ప్రదర్శించారన్నారు మొత్తంగా జిల్లాలో అధికారులు ఎమ్మెల్యేల మాట వినడం లేదనే అంశం జడ్పీ సమావేశంలో బయటపడిందన్నారు. ఈ వైఖరి సమంజసం కాదని అధికారులతో పని చేయించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ తరహా నిర్లిప్తత వల్ల ప్రజలకు నష్టం జరుగుతుందన్నారు.ఎమ్మెల్యే తన అధికారాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని ప్రజలకు మేలు చేయాలని సూచించారు. పామర్రు ఎమ్మెల్యే నిమ్మకూరు గురుకుల పాఠశాలలో ఒక లెక్కల మాస్టారు విషయంలో విద్యాశాఖ అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు సమర్పించి స్వయంగా ఫోన్లో మాట్లాడినా సంబంధిత అధికారులు స్పందించలేదని జడ్పీ సాక్షిగా చెప్పుకొచ్చారన్నారు. ఇది చాలా బాధాకరమని ఈ తరహా మెతక వైఖరి వల్ల గురుకుల పాఠశాల విద్యార్థులకు నష్టం జరుగుతుందని దానికి ఎమ్మెల్యేనే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ విధంగా జడ్పీ సమావేశంలో అధికారులు తమ మాట వినడం లేదని ఎమ్మెల్యేలంతా ఏకరువు పెట్టడం వింతగా ఉందన్నారు. ఇది అవగాహన లోపంతో జరుగుతుందో లేక సమర్థత లేక ఈ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయో అర్థం కావడం లేదన్నారు.ఇప్పటికైనా సంబంధిత ఎమ్మెల్యేలు చురుకుగా పనిచేసి ప్రజలకు న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ తరపున కోరుతున్నట్టు డివైదాస్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



పిన్నమనేని సిద్ధార్థ్ హాస్పిటల్, కొమరగిరి ట్రస్ట్ ఆధ్వర్యంలో

## ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

**వత్సవాయి జూలై 28 మేజర్ న్యూస్ :** మండలం లో కాకరవాయి గ్రామం నందు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం జూలై 30 న జరుగుతుందని ట్రస్ట్ చైర్మన్ తెలిపారు. సమయం ఉదయం 10.30 గంటలు నుండి మధ్యాహ్నం 2 గంటలు వరకు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. స్థలం: మండల పరిషత్ పాఠశాల (శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం ఎదురుగా) ఆపరేషన్ అవసరం అయిన వారికి పరీక్షలు చేసిన రోజే బస్సులో తీసుకొని వెళ్ళి ఉచితంగా ఆపరేషన్ చేయించబడునని తెలిపారు. పరీక్షలకు వచ్చే వారు తమతో ఆధార్ కార్డు తీసుకొనిరాగలరని కొమరగిరి సేవా ట్రస్ట్ చైర్మన్ కొమరగిరి రవీంద్ర భరద్వాజ్ తెలిపారు.

## దేశంలో ఇండియా కూటమి కుటిల రాజకీయాలు చేస్తుంది



నందిగామ, జూలై 28, మేజర్ న్యూస్:దేశమంటే తమ ఇల్లు అన్నట్టుగా తమ జాగీర్ అన్నట్టుగా ప్రజలందరూ తమ బానిసలు అన్నట్టుగా చేయడం ప్రతిపక్ష పార్టీల ముఖ్యమంత్రులకు ఫ్యాషన్ అయిపోయింది అని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి కేదార్నాథ్ శర్మ అన్నారు. ఆదివారం పత్రిక ప్రకటన ద్వారా తెలుపుతూ ఎందుకంటే నీతి ఆయోగ్ సమావేశం ప్రజలకు సౌకర్యాలు కలగచేయడానికి నిధులు కేటాయించడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చేటువంటి ఒక అవకాశం అటువంటి చోట ప్రజలకు ఏం కావాలో వాటిని చూపించి నిధులు సేకరించి ఆ నిధులను రాష్ట్రంలో ప్రజల సౌకర్యాల కల్పనకు అభివృద్ధికి వాడుకోవాల్సినటువంటి రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయాల కోసం తమ కుర్చీలు నిలబెట్టుకోవడం కోసం బిజెపిని బెదిరించడానికి వేదికగా వాడుకోవటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. ఇండియా కూటమి ముఖ్యమంత్రులు అందరూ ఒక మాట అనుకోని ఈ విధంగా చేయటం శోచనీయం ఖండించవలసిన విషయం ఎందుకని అంటే బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పటిదాకా ఉన్నటువంటి 30% వాటాని 46 శాతానికి చేసి కేంద్ర నిధులలో ఎక్కువ భాగాన్ని రాష్ట్రాలకే కేటాయించిన అది కూడా సరిపోవన్నట్టు కాంగ్రెస్ పార్టీ ప్రాంతీయ పార్టీలు ఉచితాలతో బిజెపిని గద్దె దించాలని ఇష్టం వచ్చిన రీతిన ఉచితాలు ప్రకటించి వాటి నిధులు కోసం అని చెప్పేసేసి కేంద్ర ప్రభుత్వాన్ని బెదిరించి నీతి ఆయోగ్ ద్వారా నిధులు పొంది చేయాలనేటువంటి దుష్ట ఆలోచన ఖండించాలన్నారు.

# ఫణి కుమార్ కు స్వర్ణ నంది కళాకారు సేవారత్న అవార్డు ప్రధానం



**పెడన, మేజర్ న్యూస్ :** మెగా ఎంటర్ప్రైజెస్ సంస్థ వారి ఐదవ వార్షికోత్సవ సందర్భంగా ఐదవ బిరుదు ప్రధాన కార్యక్రమంలో పట్టణానికి చెందిన పిచ్చుక ఫణి కుమార్ కు స్వర్ణ నంది కళాకారు సేవారత్న అవార్డు ప్రధానం చేయడం జరిగిందని ఆ సంస్థ ఎండి ఎస్.శిరీష రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్ చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గాన సభ ఆడిటోరియంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పెడన వాస్తవ్యుడు, పేద ప్రజల బాగుకోరే వ్యక్తి, కరోనా విపత్కర పరిస్థితుల్లో అనేక సేవా కార్యక్రమాలు చేసిన సేవాతత్పరుడు, అనునిత్యం కాకపోయినా అవకాశం కుదిరిన ప్రతిసారీ నిరుపేదలకు నిత్యావసర సరుకులు, నూతన వస్త్రాలు ఉచితంగా అందించే దాత, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వాహకుడు ఏఐడబ్ల్యూఎఫ్ శాఖ అధ్యక్షునిగా విధులు నిర్వహిస్తూ చేనేతలకు చేయూత నివ్వాలనే ఆశావహుడు ఫణి కుమార్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర శాసనమండలి సభ్యులు సతీష్, ప్రముఖ సినీ నటుడు జెమిని సురేష్,సినీ దర్శకుడు రుద్ర శ్రీనివాస్, పారిశ్రామికవేత్త శ్యాంసుందర్,అను క్లినిక్ అధినేత్రి అను,ఏ ఐ డబ్ల్యూ ఎఫ్ అధ్యక్షులు భండారు ఆనంద ప్రసాద్,మరియు ఏఐడబ్ల్యూఎఫ్ కృష్ణాజిల్లా కార్యదర్శి ఆకురాతి జనార్ధన్రావు, కోశాధికారి తాళ్ల బాలాజీ, మిత్రులు వి.చలం, ఆశపు సముద్రేశ్వరరావు, ఆశపు కోట నాగ బసవయ్య, కట్టా హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



## బందరులో మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

**గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్**

**గన్నవరం, జూలై 28, మేజర్ న్యూస్ :** జిల్లా ఘన చరిత్రను భావితరాలకు తెలిసే విధంగా జిల్లా అభివృద్ధికి పునాదులు వేసిన మహనీయుల విగ్రహాలు జిల్లా కేంద్రమైన బందరు లో ఏర్పాటు చేయాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ కోరారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం లో యార్లగడ్డ మాట్లాడుతూ ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకులు స్వర్గీయ భోగరాజు పట్టాభి సీతారామయ్య, జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు,తోట నరసయ్య, కాకాని వెంకటరత్నం లాంటి ఎందరో మహనీయుల విగ్రహాలను పైలాన్ రూపంలో ఏర్పాటు చేయాలని సూచించారు. విగ్రహాల ఏర్పాటుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని జిల్లా మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ, చైర్ పర్సన్ ఉప్పాల హారికలను కోరారు. విగ్రహాల ఏర్పాటు చేయాలన్న యార్లగడ్డ సూచనకు జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## గన్నవరం విమానాశ్రయానికి ఎన్టీఆర్ పేరు పెట్టాలి



నందిగామ, జూలై 28, మేజర్ న్యూస్: గన్నవరం విమానాశ్రయానికి విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు రాజకీయ దురంధరుడు అన్న ఎన్టీఆర్ పేరు పెట్టాలని అఖిలభారత ఎన్టీఆర్ అభిమాన సంఘ ఉపాధ్యక్షులు వడ్డెల్లి సాంబశివరావు విన్నవించారు. ఎన్టీఆర్ పేరు పెట్టటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అందరూ అనుకుంటున్నారు కనుక తక్షణమే గన్నవరం విమానాశ్రయానికి అన్న ఎన్టీఆర్ పేరు నిర్ణయించడానికి అసెంబ్లీలో బాబు ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తారని కోట్లాది ఎన్టీఆర్ అభిమానులు, 10 కోట్ల తెలుగువారు కోరుతున్నారు.తప్పకుండా గన్నవరం విమానాశ్రయానికి అన్న ఎన్టీఆర్ పేరు పెట్టాలని ఎన్టీఆర్ అభిమానులు కోరుతున్నట్లు తెలిపారు.

## ఎమ్మెల్యే సౌమ్యకు చర్చి సంఘస్తుల ఆత్మీయ సన్మానం



**చందర్లపాడు, జులై 28, మేజర్ న్యూస్:** మండలం లోని కోనాయపాలెం ఆర్.సి.యం చర్చి సంఘస్తులు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఆదివారం నాడు కోనాయపాలెం ఆర్.సి.ఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కూటమి విజయం సాధించి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా నందిగామ శాసన సభ్యులుగా తంగిరాల సౌమ్య అత్యధిక మెజారిటీతో విజయం సాధించినందుకు వారు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, మత పెద్దలు సౌమ్య కు ఆశీర్వాదం అందజేశారు. ఈ క్రమంలో సౌమ్య మాట్లాడుతూ, గతంలో తంగిరాల ప్రభాకరరావుతో ఉన్న ఆత్మీయత, అభిమానాలు తనపై సంఘస్తులు చూపుతున్నందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఫాదర్, ఆర్. సి.ఎం. చర్చి కమిటీ సభ్యులు, సంఘస్తులతో పాటు మహిళలు, స్థానిక పార్టీ నేతలు పాల్గొన్నారు.



# దివిసీమ రైతాంగానికి ఎలుకల బెడద

**ఎలుకల నివారణకు చర్యలు శూన్యం**
**అధికారులకు అందుబాటులో లేని వ్యవసాయ అధికారులు**







**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** దివిసీమలో ఎలుకల బెడద ఎక్కువ అవ్వడంతో రైతులు ఆందోళ చెందుతున్నారు. నివారించేందుకు వ్యవసాయ అధికారులు చర్యలు చేపట్టడం గానీ, రైతులకు సూచనలు చేయడం కానీ కనిపించడం లేదని రైతులు ఆవేదనలు వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనులకు రైతులు శ్రీకారం చుడుతున్న సమయంలో ఆకుమడులు సిద్దం చేసుకుని విత్తనం వేసింది మొదలు ఎలుకల బెడద ప్రారంభం కావడంతో రైతులు ఆకుమడిలోని విత్తనాలను ఎలుకల బెడద నుండి రక్షించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. విత్తనం వేసింది మొదలు పంట చేతికి వచ్చే వరకు 120 రోజుల పాటు ప్రతినిత్యం ఎలుకల బెడదను ఎదుర్కోనేందుకు అష్టకష్టాలు పడుతూ అధికంగా వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. ఆకుమడులు వేసిన రెండవ రోజునే ఎలుకల నివారణకు బుట్టలు ఏర్పాటు చేయగా 105 ఎలుకలు ఒక్క రోజులోనే బుట్టలో పడ్డాయంటే ఎలుకల బెడద ఏ మాత్రం ఉందో అర్ధం అవుతుంది. ఆకుమడి పోసిన తరువాత వారం రోజుల పాటు పడరాని కష్టాలు పడుతూ తదనంతరం ఆకుమడికి సాగునీరు పూర్తి స్ధాయిలో పెట్టడంతో నాటు వేసే వరకు ఎలుకల బెడద కొంతమేర తగ్గుతుంది. ఎలుకలకు బుట్టలు పెట్టి వాటిని నివారించేందుకు ఒకొక్క ఎలుకకు 25 నుండి 30 రూపాయలు రైతాంగం చెల్లించుకోవలసిన పరిస్ధితి ఉంది. పంట పోలాల్లో పాములు సయితం తిరుగుతున్న ఎలుకల బెడద మాత్రం తగ్గడం లేదని రైతులు వాపోతున్నారు. ఎలుకల నివారణకు రైతులకు సూచనలు, సలహోలు ఇవ్వవలసిన వ్యవసాయ అధికారులు మాత్రం పత్తా ఉండటం లేదు. గతంలో వ్యవసాయ అధికారులు పంట పోలాల గట్లకు వెళ్ళి రైతులకు ఎలుకల నివారణపై సూచనలు సలహోలు ఇస్తూ సామూహిక ఎలుకల నివారణకు చర్యలు చేపట్టేవారు. గత 4 సంవత్సరాలుగా పంట పోలాల్లో ఎలుకలు పంటను తీవ్రంగా నష్టపరుస్తున్నా తాత్కలిక చర్యలు మినహాయించి ఎలుకల నిర్మూలనకు చేపట్టవలసిన చర్యలు మాత్రం చెపట్టడం లేదని దివి రైతాంగం ముక్త కంఠంతో కోరుతున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు దివిప్రాంతంలో ప్రారంభమైన నారుమడులను పరిశీలించి ఎలుకల నివారణకు తీసుకోవలసిన, చేపట్టవలసిన సూచనలు, సలహోలు ఇవ్వాలని రైతాంగం కోరుతున్నారు. ఆకుమడి ప్రారంభంలోనే ఎలుకల నివారణకు 2500 నుండి 3000 రూపాయల వరకు హెచ్చించవలసి వస్తుందంటే 120 రోజుల పాటు కాపాడవలసిన వరి పంటను ఎలుకల బెడద నుండి కాపాడుకోవాలంటే ఏ విధంగా అధనంగా ఖర్చు చేయాల్సి వస్తుందో అని రైతులు భయాందోళనకు గురతవుతున్నారు.

## వైభవంగా సూర్యనారాయణ స్వామి శాంతి కళ్యాణం



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ఉషాపద్మిని సమేత సూర్యనారాయణ స్వామి వారి శాంతి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. మండల పరిధి లోని వేకనూరు గ్రామంలో వేంచ్చేసి ఉన్న సూర్యనారాయణ స్వామి వారి ఆలయం లో ఆదివారం స్వామి వారి శాంతి కళ్యాణాన్ని రెడ్రౌతు మోహన్‌రావు దంపతులు వేదమంత్రోచ్ఛారణల నడుమ కళ్యాణం నిర్వహించారు. సమీర్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆషాడమాస సారెను భక్తులు సమర్పించగా 200 మంది భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు కావలసిన ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త తుంగల వీరవసంతరావు దంపతులు పర్యవేక్షించారు.

## శ్రీహరి హత్య కేసు సీబీసీఐడీకి అప్పగించడంతో హర్షం



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ప్రముఖ వైద్యులు డాక్టర్ కోట శ్రీహరి రావు హత్య కేసును సిబిసిఐడికి అప్పగించడంపై జనసేన సీనియర్ నాయకులు బచ్చు వెంకట నాధ్ హర్షం వ్యక్తం చేశారు. అవనిగడ్డలో సంచలనం రేపిన ప్రముఖ వైద్యులు డాక్టర్ శ్రీహరి రావు హత్య కేసును సిబిసిఐడి విచారణకు వచ్చేలా కృషి చేసిన శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్‌ను ఆదివారం తన కార్యాలయంలో డాక్టర్ శ్రీహరి రావు సొంత బావమర్ధి, జనసేన పార్టీ సీనియర్ నాయకులు బచ్చు వెంకట నాధ్ మర్యాదపూ ర్వకంగా కలిసి పూలమాలలతో ఘనంగా సత్కరించి మాట్లాడారు. శ్రీహరి రావు చనిపోయి 4 సంవత్సరాలు అయినప్పటికి ఆ హత్య కేసును పోలీసులు ఛేదించలేకపోయారని, అధికారంలోనికి రాగానే శ్రీహరి రావు కేసును విచారణకు వచ్చేలా కృషి చేస్తానని, మండలి బుద్ధప్రసాద్ ఇటీవల పలు మార్లు తెలిపారని, ఆయన చెప్పిన మాట ప్రకారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి శ్రీహరి రావు హత్య కేసును మండలి బుద్ధప్రసాద్ తీసుకువెళ్ళారని, చంద్రబాబు నాయుడు శ్రీహరి రావు కేసును సిబిసిఐడి విచారణకు ఆదేశించారన్నారు. ఈ సందర్భంగా వెంకటనాథ్ బుద్ధప్రసాద్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం హర్షనీయం



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** డాక్టర్ కోట శ్రీహరి రావు హత్య కేసు విచారణ సిబిసిఐడికి అప్పగిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షనీయం అని తెలుగుదేశంపార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. అవనిగడ్డలో టిడిపి, జనసేన, బిజెపి నేతలు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేసి మాట్లాడారు. అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ చొరవతో డాక్టర్ శ్రీహరి రావు ఆత్మకు ఇప్పటికైనా శాంతి లభించిందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాటి వైసిపి ప్రభుత్వంలో అప్పటి అవనిగడ్డ ఎం.ఎల్.ఎ సింహాద్రి రమేష్ బాబుతో వ్యాపార భాగస్వామి అయిన డాక్టర్ హత్య అనేక అనుమానాలకు తావిచ్చిందన్నారు. డాక్టర్ హత్య కేసులో పోలీసులపై రాజకీయ వత్తిడిలతో ఆనాడు కేసు ధర్యాప్తు ముందుకు సాగలేదనే అనుమానాలు ఉన్నాయన్నారు. డాక్టర్ కుటుంబ సభ్యులు న్యాయం కోసం నాటి ముఖ్యమంత్రి వద్దకు వెళ్ళినా స్పందన రాలేదని,ఎన్నికల ప్రచారానికి ఈ సంవత్సరం మే నెలలో అవనిగడ్డ ప్రచారానికి వచ్చిన సమయంలో అవనిగడ్డ ప్రజలు ప్లే కార్డుల ద్వారా పవన్ కళ్యాణ్ దృష్టికి డాక్టర్ హత్య కేసును తీసుకువెళ్ళగా అధికారం చేపట్టిన రెండు నెలలు గడవకముందే స్పందించి శాసనసభ్యులు బుద్ధప్రసాద్ చొరవతో సిబిసిఐడి విచారణకు కృషి చేయడం హర్షనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో బండె శ్రీనివాసరావు, గుడివాక శివరామ్, బచ్చు రఘునాధ్, మేడికొండ విజయ్, అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, అడపా శ్రీను, అన్నపరెడ్డి రామదాసు, లుక్కా శ్రీను, గోగినేని బుజ్జి, మండలి రాంమోహన్‌రావు, విశ్వనాధుని మురళి, సోబిల ఏడుకొండలు, మోగావత్తు గోపి, చందన నరసింహారావులతో పాటు టిడిపి, జనసేన, బిజెపి నేతలు పెద్ద ఎత్తున పాల్గోని చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

# బుద్ధ ప్రసాద్ కృషితోనే సాధ్యం



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** డాక్టర్ కోట శ్రీహరి రావు హత్య కేసు శాసనసభ్యులు, మాజీ మంత్రి, విభజిత ఆంధ్రప్రదేశ్ మాజీ ఉపసభాపతి, ప్రస్తుత ప్యానెల్ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ విశేషమైన కృషి వలనే సిబిసిఐడికి బదిలీ చేయడం జరిగిందని డాక్టర్ కోట శ్రీహరి రావు తనయుడు కోట ప్రవీణ్., ఎం.డి అన్నారు. ఆదివారం ఆయన స్ధానిక విలేకరులతో మాట్లాడుతూ దాదాపు 4 సంవత్సరాలుగా ఎటువంటి పురోగతి లేని కోట శ్రీహరిరావు పాశవిక హత్య కేసును మండలి బుద్ధప్రసాద్ ఆదేశాల మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి సబిసిఐడికి బదిలీ చేయడంతో ఎట్టకేలకు సత్వర న్యాయం జరగనున్నదని అన్నారు. ఉపముఖ్యమంత్రి పవణ్ కళ్యాణ్ ఎన్నికల ప్రచారంలో ఈ కేసుకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని ఇచ్చిన హామీ రెండు నెలలు కూడా గడవకముందే వారి పార్టీ శాసనసభ్యులు అయిన మండలి బుద్ధప్రసాద్ ద్వారా కార్యరూపం దాల్చడం ప్రశంసనీయమైనది. శ్రీహరిరావుకు న్యాయం, ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్ధించిన లెక్కకు మిక్కిలి అయిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నట్లు ప్రవీణ్ చెప్పారు. వివిధ స్ధాయిలలో వారి పరిధి మేరకు 4 సంవత్సరాలు అవిశ్రాంతంగా కృషి చేసిన రాజకీయ నాయకులు, బంధుమిత్రులు, మిడియా వారికి కృతజ్ఞతలు తెలిపారు. మా కుటుంబానికి వచ్చిన కష్టం తీర్చలేనిది..... కూర్చలేనిది. ఈ విధమైన తీవ్రమైన అన్యాయం మరి ఏ కుటుంబానికి జరగకూడదన్నారు. ముఖ్యంగా పెద్ద వయస్కులు, వివాదరహితుడు, మేధావి, కష్టజీవి, నిరాడంబరుడు, మితభాషి, మృదుస్వభావి, ఆదర్శ రైతు, అద్భుత హస్తవాసి కలిగిన వైద్యులు డాక్టర్ లాంటి వారిపై సభ్య సమాజంలో ఇటువంటి దారుణం నట్టింట అసలు జరగకూడదన్నారు. రాష్ట్ర డిజిపి తిరుమల రావు, సంబంధిత పోలీసులకు పాశవిక హత్య విచారణ పూర్తి నిబద్ధత, ఖచ్చితత్వంతో వేగవంతంగా జరిపించి భాద్యులైన నేరస్తులకు సత్వరమే తీవ్రమైన శిక్షలు పడేలా చూడాల్సిందిగా కోరారు. ఈ కేసు పురోగతిని న్యాయం జరిగే వరకు సమీక్షిస్తూ పోలీస్ శాఖ వారికి దిశానిర్దేశ్యం చేయాలని మరొక సారి మండలి బుద్ధప్రసాద్‌ను కోరుతున్నట్లు చెప్పారు.

### వాతావరణంలో మార్పులు వల్ల

# నగరం ఎదుర్కొంటున్న సవాళ్లపై సమావేశం





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగరపాలక సంస్థతో కలిసి ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ లోకల్ ఎన్విరాన్మెంట్ ఇనిషియేటివ్ సౌత్ ఏషియా, సీ-40 వారు వాతావరణంలో వచ్చే మార్పులపై విజయవాడ నగరం ఎదుర్కొంటున్న సవాళ్లపై విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల నూతన భవనంలోని సమావేశం హాలు లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విజయవాడ నగరం ప్రధానంగా ఎదుర్కొంటున్న వాతావరణ మార్పులైన అధిక వర్షపాతం, ఉష్ణోగ్రతకు కారకాలైన సెక్టార్లను గుర్తించి, ఏ ఏ ప్రాంతాల్లో అధిక అధిక వర్షపాతం వల్ల వచ్చే ముంపు ఉంది, ఏ ఏ ప్రాంతాలలో అధిక ఉష్ణోగ్రత వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ బృందం సమావేశంలో వివరించింది. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్స్ కేవీ సత్యవతి మాట్లాడుతూ వాతావరణం మార్పుల వల్ల అధిక వర్షపాతం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను విజయవాడ నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంటుందని, వాతావరణం లో ఉష్ణోగ్రత తగ్గించే దిశగా పచ్చదనన్ని పెంపొందించుతున్నామన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ జనరల్ డాక్టర్ ఏ మహేష్ మాట్లాడుతూ ఈ బృందం గుర్తించిన సమస్యలను సమన్వయించుకుంటూ విజయవాడ నగరపాలక సంస్థ ముందడుగు వేస్తుందని, తీసుకోవాల్సిన చర్యల్లో సహకరిస్తుందని, వాతావరణంలోని ఉద్గారాలు తగ్గించేందుకు విజయవాడ నగరపాలక సంస్థ వివిధ ప్రాంతాలలో మొక్కలు నాటుతూ ఉద్గారాలను తగ్గించే దిశగా ప్రయాణిస్తుందని, మరింత గ్రీనరీని పెంచి, వాతావరణంలోని ఆక్సిజన్ ప్రమాణాలను పెంచుతుందని అన్నారు. ఈ సమావేశంలో విజయవాడ నగరపాలక సంస్థలతో పాటు ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్, ఏపీ సిపిడిసిఎల్, ఆంధ్ర ప్రదేశ్ ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్, ఐ ఓ సి ఎల్, ఏపీఎస్ఆర్టీసీ, మేఘ గ్యాస్, బిపిసిఎల్, హెచ్పిసిఎల్, హెల్త్ కేర్ అండ్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి







**చంద్రర్లపాడు, జులై 28, మేజర్ న్యూస్:** ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. ఆదివారం మండలంలోని ముప్పాళ్ళ గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో శంకర కంటి ఆసుపత్రి, పెదకాకాని, గుంటూరు, భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి, నందిగామ శ్రీ సత్యసాయి భజన మండలి, ముప్పాళ్ళ, జిల్లా అంధత్వ నివారణ సంస్థల వారి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం కార్యక్రమం ప్రారంభించి, ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ.. పేదలు కంటి సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని, ఈ తరుణంలో ఆయా గ్రామాల ప్రజల అభ్యర్థన మేరకు ప్రత్యేక కంటి వైద్య శిబిరం ఉచితంగా ఏర్పాటు చేసి పిల్లలకు, పెద్దలకు, వృద్ధులకు ఉచిత వైద్య సంప్రదింపులు ఇవ్వడం సంతోషకర విషయమన్నారు. కంటి చూపు లేని వారికి శస్త్ర చికిత్సలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉచిత కంటి వైద్య శిబిర నిర్వాహకులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నేతలు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ ఆధ్వర్యంలో అమ్మవారికి ఆషాడం సారే





**నందిగామ, జులై 28, మేజర్ న్యూస్:** మండలంలోని అంబారు పేట గ్రామం లో వేంచేసి ఉన్న సత్యమ్మ తల్లి అమ్మవారికి జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆషాడం సారే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ తంబళ్లపల్లి రమాదేవి, జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, శివపార్వతి లు పాల్గొన్నారు. అమ్మవారికి సారే సమర్పించి ప్రత్యేక పూజలు జనసేనపార్టీ వీర మహిళలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం జనసేన పార్టీ ఆధ్వర్యంలో సత్తెమ్మ తల్లి అమ్మవారికి సారి సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని ఆ క్రమంలో ఈరోజు పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలని వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండి రైతులు సుభిక్షంగా ఉండాలని రాయపాటి తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ వీర మహిళలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి లక్ష పుష్పాలతో పుష్పార్చన



**నందిగామ, జులై 27, మేజర్ న్యూస్:** వీరులపాడు మండల పరిధిలోని జుజ్జూరు గ్రామంలో సర్వజ్ఞ పీఠంలో శ్రీ అఖిలాండేశ్వరి అమ్మ వారికి లక్ష పుష్పాలతో పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి యోగి నరేంద్రనంద స్వామీజీ మాట్లాడుతూ ఆషాడమాసాన్ని పురస్కరించుకొని అమ్మవారికి భక్తులు సారె సమర్పించారని అనంతరం లక్ష పుష్పాలతో ఘనంగా పుష్పార్చన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. అనంతరం ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభం

**జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలను కోరారు.

## వాకర్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** గాంధీనగర్ వాకర్స్ భవనంలో ఆదివారం ఉదయపు నడక మిత్రమండలి, మహిళా విభాగం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడ టాప్ స్టార్ హాస్పిటల్స్ సౌజన్యంతో నిర్వహించిన వైద్య శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్డియాలజిస్ట్ డా. అర్చన నేతృత్వంలో బిపి, షుగర్, ఇసిజి, 2డి ఎకో పరీక్షలు నిర్వహించారు. వాసన్ ఐ కేర్ ఆప్టోమెట్రిస్ట్ జి ప్రసూన కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా మందులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉదయపు నడక మిత్రమండలి అధ్యక్ష కార్యదర్శులు కారుమూరి రాజేంద్రప్రసాద్, జల్లు మురళీనాథ్, వేదా లక్ష్మీనరసింహం, వాకర్స్ అంతర్జాతీయ కో ఆర్డినేటర్ లోయ ఈశ్వర వెంకటేశ్వర రావు, డిప్యూటీ గవర్నర్ అర్జా ప్రసాద్, ప్రోగ్రాం కోఆర్డినేటర్, మాజీ డిప్యూటీ గవర్నర్ జగన్మోహన రావు, మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులు బండి విద్యారేఖ, మల్లికాంబ పర్యవేక్షించారు.

## బజారు కుక్కల బెడద నుండి ప్రజలను రక్షించండి



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** మచిలీపట్నం నగర కార్పొరేషన్ పరిధిలో బజారు కుక్కల బెడద ఎక్కువగా ఉందని, స్కూల్స్ కి వెళ్లే విద్యార్థిని, విద్యార్థులు, వాహనాల మీద వెళ్లేవారు, పాదచారులు వీధి కుక్కల బెడదతో బెంబేలెత్తిపోతున్నారని, ముఖ్యంగా రాత్రి సమయంలో వీధి కుక్కలు గుంపుగా ఏర్పడి ప్రజలను వెంటపడి తరుముతుండటంతో నగర ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, వీధి కుక్కల బెడద నుండి ప్రజలను కాపాడాలని ఆదివారం ప్రజా దర్బారులో మచిలీపట్నం 45వ డివిజన్ కు చెందిన అద్దేపల్లి సుబ్బలక్ష్మి పార్వతీశ్వరి మంత్రి కొల్లు రవీంద్ర కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పి.వి. ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వ హయంలో లక్షలాదిమంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు అన్యాయం





**11వ పీఆర్సీ & సీఎస్ కమిటీలు సూచించిన మేరకు వేతన పెంపుకు నిరాకరణ**

**తీవ్రంగా నష్టపోయిన ఔట్సోర్సింగ్ ఉద్యోగులు**

**ప్రభుత్వ పథకాలు నిలిపివేసి ఆర్థికంగా నష్టపరిచిన గత ప్రభుత్వం**

**జీవో నెంబర్ -7 సవరించి ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం న్యాయం చేయాలి**

**సిల్డ్, సెమిస్కిల్డ్, తరగతుల వేతన వ్యత్యాసాన్ని సవరించాలి**

**సీనియార్టీ ప్రాతిపదికన వార్షిక ఇంక్రిమెంట్ ఇవ్వాలి**

**వైద్యం కోసం ఈ.యస్.ఐ కి ప్రతి నెల డబ్బులు చెల్లిస్తున్నా సరైన వైద్యం లేదు**

**నూతన ప్రభుత్వం లో కష్టాలు తీరుతాయన్న నమ్మకంతో ఔట్సోర్సింగ్ ఉద్యోగులు**

**ఏపీ జెఎసి అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రెటరీ జనరల్ పలిశెట్టి దామోదర రావు**

**విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ :** గత ప్రభుత్వ నిర్లక్ష్యం వలన రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో పని చేసే లక్షలాది మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఏపీ జెఎసి అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రెటరీ జనరల్ పలిశెట్టి దామోదర రావు, కాంట్రాక్ట్ & ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే.సుమన్, ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్ లు తెలియజేశారు.ఆదివారం విజయవాడ లెనిన్ సెంటర్లో గల రెవెన్యూ భవన్లో ఏపీ జేఏసీ అమరావతి అనుబంధంగా ఉన్న కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ, 26 జిల్లా అధ్యక్ష కార్యదర్శులతో సమావేశం జరిగింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కే సుమన్, ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి బొప్పరాజు, పలిశెట్టి ముఖ్య అతిథులుగా, ఇతర రాష్ట్ర నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల భద్రత కోసం గత ప్రభుత్వం "అప్కాస్" ఏర్పాటు చేసి కొంత ధైర్యాన్ని కలిపించినప్పటికి, వారికి సంబంధించిన జీతభత్యాలు పెంపుదల, జీతల్లో వ్యత్యాసాలు, ప్రభుత్వ పథకాలు నిలిపివేత, కనీస వైద్య సదుపాయాలు లేకపోవడం లాంటి అనేక అంశాలు గత ప్రభుత్వ పెద్దలు దృష్టికి అనేక సందర్భాల్లో ఏపీ జేఏసీ అమరావతి పక్షాన తీసుకువెళ్ళినా పట్టించుకోకుండా, పూర్తిగా నిర్లక్ష్యం వహించారని తద్వారా రాష్ట్రంలోని లక్షలాది మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో సహా తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. అందులో ప్రధానంగా 11వ పీఆర్సీ కమిటీ, అధికారులతో కూడిన సీఎస్ కమిటీ ఇద్దరు ఆమోదించి 30% వేతనాలు పెంచాలని సూచించగా అందుకు నిరాకరించిన ప్రభుత్వం కేవలం 23% మాత్రమే వేతనం పెంచగా ఏడు శాతం తగ్గించినందువలన ఔట్సోర్సింగ్ ఉద్యోగులు 2022 జనవరి నుండి ఇప్పటివరకు వేల రూపాయల నష్టపోవాల్సి వచ్చిందన్నారు. పి ఆర్ సి కమిటీ సూచించిన మేరకు వేతనం పెంచి ఉంటే ఔట్సోర్సింగ్ ఉద్యోగులు కొంతమేర లబ్దిపొంది ఉండేవారని తెలియజేశారు. అదే 2014-19 నాటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో వీరి జీతాలు 10వ పీ.ఆర్.సి ద్వారా దాదాపు 50% పెంపుదల జరిగిందనే విషయాన్ని కూడా జీఓ ఎం సమావేశంలో స్పష్టంగా చెప్పినా ఎలాంటి ఉపయోగం జరగలేదు. అసలే అరా కోరా జీతం వస్తున్నప్పటికీ ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ సిఎఫ్ఎంఎస్లో ప్రభుత్వ ఉద్యోగిగా చూపడంతో ఔట్సోర్సింగ్ ఉద్యోగులు అందరూ గత ప్రభుత్వ హయంలో ప్రభుత్వ పథకాలు ఉద్యోగి కోల్పోవడమే కాకుండా, వారితోపాటు వారిపై ఆధారపడి ఉన్న వారి కుటుంబ సభ్యులు కూడా ప్రభుత్వ పథకాలు రద్దు చేసినందున ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారని తెలియజేశారు. ఒక్కో ఉద్యోగి సంవత్సరానికి లక్షల రూపాయలు ఆర్థికంగా నష్టపోయారని తెలియజేశారు.

అదే 2014-19 నాటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో వారి కుటుంబ సభ్యులకే కాకుండా ఔట్ ఉద్యోగులందరికీ కూడా అన్ని ప్రభుత్వ పథకాలు వర్తించేవి అనే విషయాన్ని కూడా జీఓఎం సమావేశంలో స్పష్టంగా చెప్పినా ఎలాంటి ఉపయోగం జరగలేదు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కొరకు గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ సెవెన్ లో అన్ని కేటగిరీలను చూపకపోవడం అదేవిధంగా జీవోలో అథర్స్ ఆప్షన్ లేకపోవడంతో ఆ జీవో వల్ల కూడా ఔట్సోర్సింగ్ ఉద్యోగులు గత అయిదు సంవత్సరాలుగా తీవ్రంగా నష్టపోవడంతో పలుమార్లు ఆ జీవోను సవరించాలని గత ప్రభుత్వానికి విన్నవించిన ఫలితం లేకపోయిందన్నారు.

అదే 2014-19 నాటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఇచ్చిన జీఓనెం.3లో అదర్స్ ఆప్షన్ ఉన్నందున అందరికీ ఒకే రకమైన జీతాలు వచ్చాయి అని అనేక సందర్భాల్లో గత ప్రభుత్వం దృష్టికి స్పష్టంగా చెప్పినా ఎలాంటి ఉపయోగం జరగలేదన్నారు. కొన్ని ప్రధానమైన శాఖల్లో పని చేస్తున్న స్కిల్డ్, సెమి స్కిల్డ్, అన్ స్కిల్డ్ తరగతుల్లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జీతాల్లో వ్యత్యాసాలు ఉన్నాయని అనేకసార్లు గత ప్రభుత్వ హయంలో వివరించినా ఎలాంటి న్యాయం జరుగక వాళ్ళు అనేక ఉద్యమాలు రాష్ట్ర స్థాయిలో చేశారు. అయినప్పటికీ గత ప్రభుత్వం ఉద్యోగులతో అమలు చేస్తామని ఒప్పందాలు చేసుకొని కూడా అమలు చేయలేదని తెలియజేశారు. లేబర్ డిపార్ట్మెంట్ వాళ్ళు స్పష్టంగా స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వాళ్లకు ఎంతెంత జీతాలు ఉండలో చెప్పినప్పటికీ, శాఖాపరమైన అధికారులు అమలు చేయకపోవడం వల్ల స్కిల్డ్, సెమీ స్కిల్డ్ ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రంగా నష్ట పోయారు.

కనుక ఇప్పటికైనా ప్రభుత్వం ఈ సమస్య శాస్విత పరిష్కారానికి చొరవ చూపి జీవో నెంబర్ 30 నీ సవరించి, న్యాయబద్ధంగా స్కిల్డ్, సెమీ స్కిల్డ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు ఇచ్చి రాష్ట్రంలోని ఔట్సోర్సింగ్ ఉద్యోగులను ఆదుకోవాలని కోరారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖల్లో తక్కువ జీతానికి పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సీనియార్టీ ప్రాతిపదికన ప్రతి సంవత్సరం ఎంతోకొంత ఇంక్రిమెంట్ ఇస్తూ వేతన వ్యత్యాసాన్ని అమలు చేసి ఔట్సోర్సింగ్ ఉద్యోగులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. వైద్యం కోసం ఈ.యస్.ఐ కి ప్రతి నెల డబ్బులు చెల్లిస్తున్నా సరైన వైద్యం లేదని తెలుపుతూ ప్రతి ఔట్ సోర్సింగ్ ఉద్యోగి తన జీతం నుండి తనకు, తన కుటుంబ సభ్యులు వైద్యం కోసం ప్రతి నెల ఈ.యస్.ఐ క్రింద డబ్బులు చెల్లిస్తున్నప్పటికి, సరైన వైద్యం అందక అనేక ఇబ్బందులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఈ.యస్.ఐ ఆసుపత్రిలో సరైన వైద్య సదుపాయాలు లేకపోతే, వాళ్ళు ఇతర ఎంప్యానల్డ్ ప్రైవేటు ఆసుపత్రులకు రిఫర్ చేస్తే, ఆయా ఆసుపత్రుల యాజమాన్యం వైద్యం చేయడానికి నిరాకరిస్తే, లక్షల రూపాయలు వడ్డీకి అప్పులు తెచ్చుకుని తనకు, తన కుటుంబ సభ్యులు కు వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కనుక ప్రభుత్వం తక్షణమే ఈ.యస్.ఐ, ఎంపానల్డ్ ఆసుపత్రుల యాజమాన్యం తో సమావేశాలు పెట్టీ సరైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి అనేక దీర్ఘ కాలిక సమస్యలు పరిష్కారం కాక, ఎక్కువ సమయం పని చేస్తూ, అతి తక్కువ వేతనాలు పొందుతున్న ఔట్ సోర్సింగ్ తీవ్రంగా నష్ట పోతున్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం, పట్టించుకోని కారణంగా రాష్ట్రంలోని లక్షలాది మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని, నూతన ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వంపై ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఆశ పెట్టుకుని ఉన్నారని, ప్రభుత్వం వీరి సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఏపీ గ్రామ సచివాలయ సేవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వీ ఆర్లయ్య, ఏపీ పి టి డి ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ భానుమూర్తి, విజయవాడ సిటీ జేఏసీ అధ్యక్షులు శంకర్, కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు 26 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

# సామాజిక వర్గ అభ్యున్నతికి పాటుపడే లా కార్యచరణ

**విజయవాడలో ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘ రాష్ట్రస్థాయి సమావేశం**







**విజయవాడ, మేజర్ న్యూస్ :** సామాజిక వర్గ అభ్యున్నతికి పాటుపడేలా కార్యచరణ రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘ రాష్ట్రస్థాయి సమావేశం తీర్మానించింది. ఆదివారం ముట్టే శ్రీరామచంద్రరావు, మెరువ వేంకటేశ్వర, కౌతవరపు ప్రసాద్ త్రి సభ్య కమిటీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 26 జిల్లాల నుంచి పద్మశాలి సంఘల రాష్ట్ర స్థాయి ప్రతినిధులు స్థానిక బందర్ రోడ్‌లోని బసవ పున్నయ్య భవన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పద్మశాలి సామాజిక వర్గనికి చెందిన అన్ని పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా గ్రామ వార్డు ప్రతినిధులుగా వ్యవహరిస్తున్న, వ్యవహరించిన, సంఘ నాయకులు గ్రామ పెద్దలు ముఖ్య నాయకులు 300 మంది ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం ఆంధ్ర రాష్ట్రంలోని పద్మశాలి వర్గానికి చెందిన అందరిని ఏకతాటిపై నడిపించి ఒకే సంఘం ఏకగ్రీవంగా ఏర్పడి ఐక్యతతో సామాజిక న్యాయం,ఆర్థిక న్యాయం, రాజకీయ న్యాయం, పద్మశాలీలకి జనాభా నిష్పత్తి ప్రకారం చేకూరేలా హక్కులు సాధించుకునే దిశగా కార్యాచరణ నిర్ణయించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. పద్మశాలి సామాజిక వర్గాన్ని ఓటు బ్యాంకుగా చూసినప్పటికీ అన్ని పార్టీల నుంచి సమ న్యాయం జరిగేలా, అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లేలా అనేక విషయాలు కార్యచరణ చేసుకొని ముందుకు వెళ్తామని, ప్రభుత్వానికి అన్ని పార్టీలకి వారికి పద్మశాలి సామాజిక వర్గ నికి సమ న్యాయం పాటించాలని సూచిస్తూ, అలాగే పార్టీలో ఉన్న పద్మశాలి వర్గానికి చెందిన నాయకులు మీ బాధ్యత మీరు విస్మరించొద్దని తెలియజేస్తూ ఇకనుండి రాష్ట్రంలో అనేక పద్మశాలి సంఘాలు ఏకతాటిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి సంఘంగా ఏర్పడి పద్మశాలి సామా జిక వర్గ అభ్యున్నతికి పాటుపడే లా కార్యచరణ గావించి ముందుకు వెళతా మని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సింగరి సంజీవ్ కుమార్, గంజి చిరంజీవి, సంఘ పెద్దలు వైకే, పద్మశాలి ఇంటర్నేషనల్ అధ్యక్షులు స్వర్గం పుల్లా రావు, ఇతర ముఖ్యులు పాల్గొన్నారు.

# క్రియాశీలక సభ్యత్వం విజయవంతం







## పశ్చిమలో రికార్డు స్థాయిలో క్రియా సభ్యత్వాలు

### పశ్చిమ నియోజకవర్గ క్రియాశీలక సభ్యత్వ ఇంఛార్జ్ మండలి రాజేష్

**విజయవాడ పశ్చిమ, మేజర్ న్యూస్ :** జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోద కార్యక్రమం భారత దేశ రాజకీయ చరిత్రలో ఒక కేస్ స్టడీలా నిలిచిపోతుందని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మండల రాజేష్ స్పష్టం చేశారు. కార్యకర్తల భద్రత, సంక్షేమమే ధ్యేయంగా ఉపముఖ్యమంత్రి, పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమ సమన్వయకర్తగా బాధ్యతలు స్వీకరించిన రాజేష్, చివరి రోజు నియోజకవర్గం పరిధిలోని అన్ని డివిజన్లలో విస్తృతంగా పర్యటించి సభ్యత్వ నమోదు ప్రక్రియని పర్యవేక్షించారు. గత ఏడాది 4,800 క్రియాశీలక సభ్యత్వాలు నమోదు కాగా., 4వ విడత దాదాపు రెట్టింపు సభ్యత్వాలు లక్ష్యంగా పెట్టుకున్నారు. అన్ని డివిజన్లలో ఆదివారం చివరి రోజు కావడంతో క్రియా వాలంటీర్లు ప్రత్యేక టెంట్లు వేసి మరీ కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ.. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ఇంఛార్జ్ లేకపోయినా ఈ నెల 18 నుంచి ప్రారంభం అయిన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అద్భుతంగా ముందుకు తీసుకువెళ్లడం జరిగింది. సీనియర్ నాయకులు, అన్ని డివిజన్ల అధ్యక్షులు, క్రియా వాలంటర్లు సమష్టి కృషితో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. గత పది రోజులుగా నియోజకవర్గం పరిధిలో కార్యక్రమాన్ని పర్యవేక్షించే అవకాశం కల్పించిన పవన్ కళ్యాణ్‌కి ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. ప్రతి కార్యకర్త క్రియాశీలక సభ్యత్వ ఆవశ్యకతను తెలుసుకోవాలి. సభ్యత్వ నమోదు చేసుకోని కార్యకర్తలు ఈ అవకాశాన్ని చివరి నిమిషం వరకు సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉంది. రాబోయే రోజుల్లో క్రియాశీలక సభ్యులంతా ప్రభుత్వానికి, పార్టీకి మధ్య వారధులుగా మారి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు... ఈరోజు పశ్చిమ నియోజకవర్గం పలు డివిజన్ లో పర్యటించడం జరిగింది ఇందులో జనసేన నాయకులు అజయ్ వర్మ ఠాగూర్, కొప్పిశెట్టి మూర్తి, ఐటీ కోఆర్డినేటర్ మంతాపురం రాజేష్ పాల్గొన్నారు.





# జన సైనికులకు జనసేనని ఎప్పుడూ అండగా ఉంటాడు



**పెడన,మేజర్ న్యూస్ :** జనసేన కార్యకర్తలకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా జనసేనని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అండగా ఉంటాడని జనసేన నాయకులు తెలిపారు ఈ మేరకు ఇటీవల జనసేన కార్యకర్త ప్రమాదవశాత్తు గాయపడితే వైద్య ఖర్చులు నిమిత్తం 50 వేల రూపాయల చెక్కును అందించమన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన సైనికులకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా తమ సేనాని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అండగా ఉంటానని హామీ ఇచ్చాడని ఈ నేపథ్యంలో ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడిన నడుపూరు గ్రామానికి చెందిన జనసైనికుడికి పార్టీ అధిష్టానం నుండి వైద్య ఖర్చులు నిమిత్తం 50 వేల రూపాయలు చెక్కు రావడంతో అందించటం జరిగిందని తెలిపారు. దీనిలో భాగంగానే జనసేన పార్టీలో ఉన్న కార్యకర్తలకు క్రియాశీల సభ్యత్వాలు నమోదు చేసి వారికి ఇన్సూరెన్స్ కూడా అమలులో ఉండేలా తమ అధినేత చర్యలు చేపట్టాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచకర్ల సురేష్, శాంతి ప్రసాదు, బత్తిన హరి రామ్, కూనపురెడ్డి రంగయ్య, పూచా వెంకయ్య, వీర్ల నవీన్ కృష్ణ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.



## మూడేళ్లుగా పూడికతీత పనులకు నోచుకోని కాలువ

**చల్లపల్లి మేజర్ న్యూస్ :** ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచనల మేరకు రైతులకు సాగునీరు సక్రమంగా సరఫరా చేసేందుకు కృషిచేస్తున్నట్లు ఇరిగేషన్ డీఈఈ రావెళ్ల రవికిరణ్ తెలిపారు. ఆదివారం చల్లపల్లి మండలం వక్కలగడ్డలో ఐదో నెంబరు యార్లగడ్డ బ్రాంచ్ ఛానల్ పంట కాలువలో మట్టి పూడికతీత పనులు ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కాలువను గత మూడేళ్లుగా పూడిక తీయకపోవటంతో 2500 ఎకరాల ఆయకట్టు కలిగిన ప్రధాన పంటకాలువ పంటబోదెలా మారిపోయింది. ఈ సమస్యను ఆయకట్టు రైతులు ఇటీవల అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన సూచనలతో ఇరిగేషన్ డీఈఈ రవికిరణ్ పర్యవేక్షణలో ఐదవ నెంబరు యార్లగడ్డ బ్రాంచ్ కాలువ పూడికతీత పనులు చేపట్టారు. తమ పంట కాలువ అభివృద్ధి చెందటంతో రైతులు హర్షం వ్యక్తంచేశారు. తమ సాగునీటి సమస్య పరిష్కారం చేసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్కు, ఇరిగేషన్ శాఖ డీఈ రవికిరణ్కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఏఈ తానేటి ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

# గ్రామ దేవత శ్రీ పైడమ్మ అమ్మవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు





**పెడన, మేజర్ న్యూస్ :** ఆషాడ మాసం సందర్భంగా ఆదివారం గ్రామ దేవత శ్రీ పైడమ్మ అమ్మవారి ఆలయానికి తెల్లవారుజామునండి భక్తులు భారీగా తరలివచ్చారు. పట్టణంలో గల వివిధ కులాలకు సంబంధించిన మహిళలు అమ్మవారికి ఆషాడ సారెను సమర్పించారు.ఈ సందర్భంగా స్థానిక 12వ వార్డు నుండి కాపులు, పట్టణ శిష్టకరణం కులస్తులు, దేవాంగ కులస్తులు, సామూహికంగా మేళ తాళాలతో, మంగళ వాయిద్యాలతో పట్టణ ప్రధాన రహదారులు గుండా ఊరేగింపుగా బయలుదేరి ముత్యాలమ్మ తల్లి ఘటం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాల నిర్వహించి అనంతరం అక్కడ నుండి పోతురాజు గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి,పైడమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి సరే రూపంలో చీర, జాకెట్, పసుపు కుంకుమ, పూలు, పళ్ళు, స్వీట్స్, అనేక రకాల వస్తువులతో మహిళలు భారీగా అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం శాఖంబరి అలంకరణలో అమ్మవారికి ఉపయోగించిన వివిధ రకాల కూరగాయలతో కదంబం ప్రసాదం అమ్మవారికి నివేదించి భక్తులకు పంచిపెట్టారు.ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దాసు వాయునందనరావు, ఆలయ ఈవో తిక్కిశెట్టి వీర వెంకట మోహన్ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కులాలకు చెందిన పెద్దలు, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు భక్తులు తదితరులు ఉన్నారు.

17వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999